## ఎయిర్‌పోర్టులో 14 కిలోల బంగారం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

**శంషాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమా నాశ్రయంలో కస్టమ్స్ అధికారులు గురువారం పెద్దఎత్తున బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కళ్లు కప్పి విదేశాల నుండి గుట్టు చప్పుడు కాకుండా బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని గుర్తించి కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నా రు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ...గురువారం తెల్లవారు జామున సుడాన్ నుండి షార్జామీదుగా జి9=458 నంబర్ విమానంలో 23మంది ప్రయాణికులు వచ్చారు. వీరందరూ మహిళలు కావడం విశేషం. వీరు తీసుకువచ్చిన లగేజీ బ్యాగులను వారి బూట్లలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మహిళల వద్దనుండి 14 కిలోల 96 గ్రాముల అక్రమ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బంగారం అక్రమ రవాణాకు పాల్పడిన 23మంది మహిళలను అదుపులోనికి తీసుకొని విచారిస్తున్నారు. వారిలో నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం విలువ అంతర్జాతీయ మార్కెట్లో ఏడు కోట్ల 89 లక్షల రూపాయలు ఉంటుందని వివరించారు. ఇటీవల కాలంలో ఇంత పెద్ద ఎత్తున బంగారం దొరకడం ఇదే మొదటిసారి.

# 25 రోజుల్లో 50 లక్షల 'కంటి వెలుగు' పరీక్షలు


- ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానం
- ప్రజల కళ్లలో ఆనందభాష్పాలు..

ప్రతిపక్షాలకు కన్నీళ్లు: మంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సర్వేంద్రియానం నయనం ప్రధానం..అన్ని అవయాలకంటే కళ్లు అతిముఖ్యమైనవి.. కళ్లు కనిపించకుంటే ప్రపంచమే చీకటి అవుతుందని అర్థిక, అరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని 26వ వార్డులో గురువారం అయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో అంధత్వాన్ని పూర్తిగా నివారించడానికే సిఎం కెసిఅర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా సిఎం కెసిఅర్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. సిఎం కెసిఅర్ అలోచనతో ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమం అద్భుతంగా పండుగ వాతావరణంలో కొనసాగుతుం దన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా కంటి వెలుగు కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి అవ్వకు, ప్రతి అయ్యాకు, ప్రతి అక్కకు, ప్రతి చెల్లికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఉన్న కంటి సమస్యలను దూరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజల్లో అనందభాష్పలు వస్తుంటే ప్రతిపక్షాల్లో కనీళ్లు వస్తున్నాయన్నారు. కంటి వెలుగు కార్యక్రమానికి కులం, మతం, జాతి లేదని మానవత్వం, మంచి తనం ఒక్కకే మాకు కనిపిస్తుందన్నారు. కంటి వెలుగు పరీక్షలలో రాష్ట్రంలోనే సిద్దిపేట మొదటి స్థానంలో ఉందన్నారు. కంటి వెలుగు శిబిరం ప్రారంభించిన 25 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింద న్నారు. 50 లక్షల మందిలో 16 లక్షల మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. 16 లక్షల మందికి కంటి వెలుగును అందించిన గొప్ప వ్యక్తి సిఎం కెసిఅర్ అన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో 26 లక్షల 42 వేల మంది స్త్రీలు, 23 లక్షల 39 వేల మంది పురుషులు పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు. 9 లక్షల 36 వేల మందికి రీడింగ్ కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 6,49, 507 మందిలో 54, 324 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ పంపిణీ చేసినట్లు వివరించారు. గతంలో ఇతర రాష్ట్రాల నుంచి కంటి అద్దాలు దిగుమతి చేసుకోగా ఈ సారి మేడిన్ తెలంగాణ కంటి అద్దాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. కంటి వెలుగు నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.250 కోట్లు కేటాయించిందన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని పంజాబ్, ఢిల్లీ సిఎంలు అదర్శంగా తీసుకుంటున్నారని తెలిపారు. కంటి వెలుగు పరీక్షల నిమిత్తం 15 వందల బృందాలు పని చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. జూన్ చివరి వరకు కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతాయన్నారు. కంటి వెలుగు కార్యక్రమం ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో విజయవంతం కొనసాగుతుం దన్నారు. ప్రధానంగా కంటి వెలుగు శిబిరాలను విజయవంతం చేయడంలో పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు, జిల్లా కలెక్టర్లు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతం చేయడానికి సహకరిస్తున్న పిఅర్, మున్సిపల్ మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, వైద్య అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ కాశీనాథ్, సుడా ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు కెమ్మసారం ప్రవీణ్, నాగార్జునరెడ్డి, సాయి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి హరీష్‌రావు కంటి పరీక్షలు చేయించుకున్నారు.



కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి హరీశ్‌రావు




## ముగిసిన బయోమి అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన గురుకుల విద్యాలయాల సంస్థల ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న బయోసైన్సెస్, ఫార్మసీకి సంబంధించిన బయోమి-23 అంతర్జాతీయ సదస్సు ముగిసింది. కన్హ శాంతి వనం వద్ద జరుగుతున్న ఈ అంతర్జాతీయ సదస్సు మూడో రోజు గురువారం అడ్వాన్సెస్ ఇన్ బయాలసీ అండ్ మెడిసిన్‌పై సిసిఎంబి డైరెక్టర్ డాక్టర్ వినియ్‌కె నందికూరి వ్యాక్సిన్‌లు, వాటి సమర్థత గూర్చి వివరించారు. కొత్త రకాలుగా ముందు వచ్చే సవాళ్లపై సదస్సులో హాజరైన ప్రతినిధులకు అవగాహన కల్పించారు. వైరస్‌లు వేగంగా అభివృద్ధి చెందుతూ మహమ్మారికి దారితీస్తున్నాయన్నారు. ఇందుకు కరోనా 19 వైరస్, దాని వివిధ రూపాంతరాలు, వాటి ప్రభావాలు, ఆరోగ్యంపై దుష్ప్రభావాలను గూర్చి ఉదాహరణలను ఉటంకిస్తూ వివరించారు. టాటా ఇనిస్టిట్యూట్ ఫర్ జెనెటిక్స్ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్‌మిశ్రా మాట్లాడుతూ జి 20 సమ్మిట్‌లో ప్రతిపాదించిన వన్ హెల్త్ అనే కాన్సెప్ట్ గురించి వివరించారు. మున్సిపాలిటీల పాత్ర, పరిశుభ్రత, అందుకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను గూర్చి అవగాహన తీసుకురావడంలో కీలకపాత్ర తదితర వాటిపై వివరాణాత్మకంగా తెలిపారు. వివిధ వ్యాధులకు కారణమయ్యే జీవులను నియంత్రించేందుకు మున్సిపాల్టీలు సమర్థవంతంగా వ్యవహరించాలన్నారు. ఈ సదస్సు చివరిలో విజేతలకు అవార్డుల ప్రదానం, సర్టిఫికెట్ల పంపిణీతో ముగిసింది.

## ఢిల్లీ లిక్కర్ స్కాం.. తీహార్ జైల్లో బుచ్చిబాబును ఆరు గంటలపాటు విచారించిన ఇడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన లిక్కర్ స్కాంలో హైదరాబాద్‌కు చెందిన చార్టెడ్ అకౌంటంట్ గోరంట్ల బుచ్చిబాబును ఈడీ అధికారులు గురువారం నాడు తీహార్ జైల్లో ఆరు గంటల పాటు విచారించారు. ఇటీవల అరెస్టయిన బుచ్చిబాబు తీహార్ జైల్లో నిర్బంధంలో వుండడం తెలిసిందే. ఇత న్ని విచారించేందుకు ఈడీ అధికారులు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నుంచి బుధవారం అనుమతి తీసుకోవడం విదితమే.

రౌస్ అవెన్యూ కోర్టు రెండు రోజుల అనుమ తి ఇవ్వగా ఇందులో భాగంగా ఈడీ అధికారులు మొదటి రోజు జైల్లో ప్రత్యేక ఏర్పాట్ల మధ్య బుచ్చిబాబును విచారించారు. ఈ కేసులో ఇంతకు ముందు బుచ్చిబాబు ను ఈడీతో పాటే సిబిఐ అధికారులు పలుమార్లు విచారించడం గమనార్హం. అయితే తాజాగా ఎపికి చెందిన వైసిపి ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి అరెస్టు తరువాత వెలుగుచూసిన వివరాల నేపథ్యంలో బుచ్చిబాబును ఈడీ అధికారులు మరో దఫా విచారించాలని నిర్ణయించారు. ఈ విచారణ లో లిక్కర్ స్కాంకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాల రింగు అంశాలను వెలికితీసే పనిలో ఈడీ అధికారులు వున్నారు. కాగా బుచ్చిబాబును శుక్రవారం కూడా విచారించ నున్నారు.

# వైద్య విద్యార్థిని ప్రీతి ఆరోగ్యపరిస్థితి విషమం

- ఎక్మో సపోర్ట్ ద్వారా చికిత్స
- బ్రెయిన్ డ్యామేజ్ అయినట్లు వైద్యుల ప్రకటన
- ఆత్మహత్యాయత్నం ఘటనపై కమిటీ ఏర్పాటు
- పోలీసుల అదుపులో నిందితుడు సైఫ్
- ఎసిపి నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు

**ప్రభాతవార్త ప్రతినిధి, వరంగల్:** సీనియర్ విద్యార్థుల వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వరంగల్ జిల్లా కేఎంసీ మెడికో పీజీ యూనివర్సిటీ విద్యార్థిని ప్రీతి ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతోంది. ప్రీతి ఆరోగ్య పరిస్థితిపై నిమ్స్ వైద్యులు తాజా బులిటెన్ విడుదల చేశారు. ప్రస్తుతం ప్రీతి ఆరోగ్యం అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎక్మో సపోర్ట్ ప్రీతికి చికిత్స చేస్తున్నట్లు పేర్కొన్నారు. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ జరిగిందని, చికిత్సకు ఆమె శరీరం సహకరించడం లేదని చెబుతున్నారు. బీపీ పల్స్ రేటు నమోదు కాని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రీతి ఆవయవాలు దెబ్బతినడంతో పాటు బ్రెయిన్ కూడా డ్యామేజ్ అయినట్లు తాజా బులిటెన్‌లో వైద్యులు తెలిపారు.

**ఆత్మహత్యాయత్నం ఘటనపై కమిటీ ఏర్పాటు**

ఆత్మహత్యాయత్నంపై కమిటీ ఏర్పాటైంది. నలుగురు ప్రొఫెసర్‌లతో కూడిన కమిటీని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సూపరిటెండెంట్ చంద్రశేఖర్ నియమించారు. కమిటీ నివేదికను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) రమేశ్‌రెడ్డికి సమర్పించనున్నారు.

**పోలీసుల అదుపులో సైఫ్**

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన నిందితుడు సైఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైఫ్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. సైళఫ్ నుంచి వాట్సాప్ వేదింపులు రోజు రోజుకు పెరిగిపోవడంతోనే ప్రీతి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదలా ఉండగా గురువారం సాయంత్రం ప్రీతి రూమ్‌ను పరిశీలించిన పోలీసులు మత్తు మందు ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్నారు.

అంతే కాక మత్తు మందు మోతాదుపై ప్రీతి గూగుల్ సెర్చ్ చేసి మరీ తీసుకున్నట్లు గుర్తించారు. కాగా ఈ కేసులో ఓ కీలక మంత్రి బంధువు ఉండటం వల్ల కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుపుతున్నారనే ఆరోపణలు రాజకీయంగా హాట్ టాఫిక్‌గా మారాయి.

**ఎసిపి నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు**

తన కూతురు ప్రీతిని.. సైఫ్ వేధిస్తున్నాడని వరంగల్ ఎసిపి కిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రీతి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తాను ఏసీపికి వాట్సాప్ ద్వారా పంపించిన ఫిర్యాదును మీడియాకు విడుదల చేశారు. కాగా ప్రీతి తండ్రి ఫిర్యాదుకు ఏసీపి తక్షణమే స్పందించి ఉంటే ఆమెకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు అజీజ్‌పాషా, నరసింహ

## మెదక్ పోలీసులపై ఐపిసి సెక్షన్ 302 కేసు నమోదు చేయాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

**మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** చట్టవిరుద్ధంగా మెదక్ పట్టణ పోలీసులు పోలీస్ స్టేషన్‌లో నాలుగు రోజులు విచారణ పేరుతో నిర్భందించి థర్డ్ డిగ్రీ ప్రయోగించి చిత్రహింసలు పెట్టడంతో మృతి చెందిన చిరు వ్యాపారి ఖాదీర్ ఖాన్ కేసులో మెదక్ పట్టణ పోలీసులపై ఐపీసీ సెక్షన్ 302 కేసు నమోదు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ. నరసింహాలు డిమాండ్ చేశారు. సీపీఐ మెదక్ జిల్లా కార్యదర్శి టీఎం. ఖాలిక్‌తో కలిసి వారు గురువారం మెదక్ పట్టణంలో బాధిత ఖాదీర్ ఖాన్ నివాసానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అనంతరం ఖాదీర్ ఖాన్ కుటుంబం గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఖాదీర్ ఖాన్‌కు గాని, ఆయన కుటుంబానికి గాని ఏ నేర చరిత్ర లేదని, ఆయన నిరుపేద పండ్లు అమ్ముకునే చిరు వ్యాపారి అని, చాలా అమాయకుడని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా సయ్యద్ అజీజ్ పాషా, ఈటీ. నరసింహాలు మాట్లడుతూ చైన్ స్నాచింగ్ అనుమానంతో మెదక్ పట్టణానికి చెందిన ఖాదీర్ ఖాన్‌ను పోలీసులు పట్టుకెళ్లి ఇంట్రాగేషన్ పేరుతో కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన అతను గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని, ఖదీర్ ఖాన్ మృతి సంఘటనకు సంబంధించి మెదక్ పట్టణ ఇన్స్‌పెక్టర్ మధు, ఎస్ఐ రాజశేఖర్, ఇద్దరు కానిస్టేబుళ్లు పవన్, ప్రశాంత్‌లను సస్పెండ్ చేసినట్లు ఐజీ ఉత్తరర్వులు జారీ చేయడం వారిని రక్షించినట్లేనని, విచారణ పేరుతో పోలీసులు చిత్రహింసలు పెట్టడంతో నిందితులు మృతి చెందితే సెక్షన్ ఐపీసీ 302 కేసును నమోదు చేసి వారిని జైలుకు పంపాలని కోరారు. దళిత మహిళ మరియమ్మ నుండి ఖదీర్ ఖాన్ వరకు పోలీస్ స్టేషన్‌లలో జరుగుతున్న లాక్‌అప్ డెత్‌లను చూసి తెలంగాణ పోలీసులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని వారు తెలిపారు. ఇలాంటి కేసులు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని, ఖాదీర్ ఖాన్ కుటుంబానికి 50 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, అలాగే ఆయన పిల్లల చదువుల ఖర్చులు ప్రభుత్వమే భరించాలని అజీజ్ పాషా, ఈటీ. నరసింహాలు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా సీపీఐ నేతలు సంజీవరెడ్డి, దుర్గయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ప్రమాదం మోడీ నియంతృత్వం

## అఖిలభారత ఫార్వర్డ్‌బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిస్వాస్



అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ సమావేశంలో పాల్గొన్న దేబబ్రత బిశ్వాస్, నారాయణ, సుభాషిణి ఆలీ తదితరులు


**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర ముప్పు కలిగించే మోదీ నియంతృత్వ విధానాలు దేశానికి ప్రమాదకరం అని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి బేబబ్రత బిస్వాస్ పేర్కొన్నారు. కార్పొరేట్లకు తప్ప సామాన్య ప్రజల ప్రయో జనాలను కాపాడటంలో ప్రధాని మోదీ విఫలమైయ్యారని దుయ్యబట్టారు. భారతదేశలో విషపూరితమైన మత జాతీయవాద వాతావరనాన్ని సృష్టించేందుకు బిజెపి, సంఘ్‌పరివార్ శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. గురువారం హైదరాబాద్ నగరంలోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ 19వ జాతీయ మహా సభలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో దేబబ్రత బిస్వాస్ ప్రసంగించారు. ఉద్యోగకల్పన కల్పించి, భారీలాభాల్ని అందించే ప్రభుత్వరంగ సంస్థలను మోడీ తన కార్పొరేట్ మిత్రుల కోసం హోల్‌సేల్‌గా అమ్మేస్తున్నారని అన్నారు. ప్రజలు తమ కష్టార్జితం సొమ్మును బ్యాంకులు, ఎల్‌ఐసిలలో దాచుకున్నారని, ఆ సొమ్మును పెట్టుబడుల రూపంలో అదానీ కంపెనీలలో మోదీ పెట్టించారని, ఇప్పుడు అదానీ కంపెనీ దివాళా తీస్తున్నాయని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ నరేంద్రమోడీ ప్రభుత్వం దేశాన్ని కాషాయీకరణ కోసం రహస్య అజెండా అమలు చేస్తున్నారని ఆరోపించారు. దేశ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వరంగ సంస్థలను టోకుగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. దేశంలో రైతులను అణచివేసి రైతులు పండించిన పంటలను దోపిడీ చేసేందుకు రైతు నల్ల చట్టాలను తెచ్చి రైతుల విరోచిత పోరాటానికి తలొగ్గి వెనక్కుతీసుకున్న విషయాన్ని పునరుద్ఘాటించారు. నిత్యావసర వస్తువులకు సంబంధించిన ప్రజాపంపిణీ వ్యవస్థను కూడా మోదీ తన మిత్రులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఎస్‌పి పార్టీ లోకసభ సభ్యుడు ప్రేమచంద్రన్ మాట్లాడుతూ సంఘ్‌పరివార్, బిజెపిలు దేశంలో హిందూముస్లీంల మధ్య గొడవలు సృష్టించి దేశంలో అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నారని అన్నారు. ఆర్‌ఎస్‌పి మాజీ ఎంపి సుభాషిణి ఆలీ మాట్లాడుతూ మోదీ తన హిందూ ఫాసిజం పరిపాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు అందరు లెఫ్ట్‌పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ నేతలు ఎన్.మూర్తి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ కార్యదర్శి జి.దేవరాజన్, డిప్యూటీ ఛైర్మన్ పి.వి.కతిరామన్, జిఆర్. శివశంకర్, నరేన్ చట్టర్జీ, గోబింద్‌రాయ్, అమరేష్‌కుమార్, సెక్రటేరియెట్ సభ్యులు జ్యోతి రంజన్, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవానికి.. కార్పొరేట్ శక్తులకు మధ్య పోటీ

పిఆర్‌టియు టిఎస్ సభలో ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరుగుతున్న ఎన్నికల్లో ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి.. కార్పొరేట్ శక్తులకు మధ్య జరుగుతుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీటీజేఏసీ తరపున చెన్నకేశవరెడ్డి నామినేషన్ దాఖలు కంటే ముందు సభను.. ర్యాలీని నిర్వహించారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావుతోపాటు మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు సభలో పాల్గొన్నారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి నామినేషన్‌ను దాఖలు చేశారు. పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపకుల ఎన్నో సమస్యలను పరిష్కరించిందని కూర రఘోత్తమ్‌రెడ్డి తెలిపారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి పరిష్కరించుకునే విధంగా చెన్నకేశవరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి మండలికి పంపించాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం 21 మంది 57 సెట్లను దాఖలు చేశారు. నేడు (శుక్రవారం) స్క్రూటినీ(పరిశీలన) కొనసాగనుంది.. ఈ నెల 27 నామినేషన్ల ఉపసంహారణకు తుది గడువు కాగా.. మార్చి 13న పోలింగ్ నిర్వహించనున్నారు.. 16న లెక్కింపు చేపడతారు.




# సేంద్రియ పితామహుడు వెంకట్‌రెడ్డికి అరుదైన గౌరవం

- నేషనల్ అకాడెమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రసంగించేందుకు ఆహ్వానం
- వ్యవసాయ రంగంపై ట్రైనీ ఐఎఎస్‌లకు దిశానిర్దేశం చేయనున్న వెంకటరెడ్డి

**హైదరాబాద్ (అల్వాల్), ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** సేంద్రియ వ్యవసాయ పితామహుడు తెలంగాణ బిడ్డ పద్మశ్రీ చింతల వెంకట్‌రెడ్డికి మరో అరుదైనగౌరవం దక్కింది. దేశంలోనే సివిల్ అడ్మినిస్ట్రేషన్(ఐఎఎస్)ల శిక్షణలో అగ్రగామి ముస్సోరి లాల్‌బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రసంగించేందుకు ఆయనకు ఆహ్వానం అందింది. కిసాన్ సమ్‌వద్(ప్రొగ్రెసీవ్ ఫార్మర్స్) వ్యవసాయ మోడ్యూల్‌ను ఆయన ట్రైనీ ఐఎఎస్‌ల వద్ద ఆవిష్కరించనున్నారు. ముస్సోరి అకాడెమీలో ప్రసంగిం చేందుకు ఆవకాశం విశిష్ట వ్యక్తులకు మాత్రమే లభిస్తుంది. సేంద్రియ వ్యవసాయ రంగాన్ని దేశంలో కొత్త పుంతలు తొక్కించిన వ్యక్తి ఆయన. దేశపరిపాలన బాధ్యతలకు కీలకమైన సివిల్ సర్వీస్(ఐఎఎస్)లకు ఆయన పాఠాలు చెప్పనున్నారు. 2022-23వ బ్యాచ్‌కు చెందిన 184 మంది ఐఎఎస్‌లు ప్రస్తుతం ముస్సోరిలో శిక్షణ తీసుకుంటున్నారు. అల్వాల్‌లో నివసించే వెంకట్‌రెడ్డి ముస్సోరి నేషనల్ అకాడమి ఆఫ్ అడ్మిని స్ట్రేషన్ నుంచి ఆహ్వానం లభించడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. దేశానికి రైతు వెన్నెముక వంటి వాడనే విషయం మరువరాదని ఆయన గుర్తు చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనగుణంగా ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని కోరారు. సేంద్రియ వ్యవసాయం వైపు యువత అడుగులు వేయడం శుభసూచకమని తెలిపారు. దేశానికి ఐఎఎస్‌లు కీలకమని, వారికి పాఠాలు చెప్పడానికి ఆహ్వానం లభించడం ద్వారా రైతుకు ఉన్న ప్రాముఖ్యత కనపడుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.



చింతల వెంకట్‌రెడ్డి (ఫైల్)

**చింతల వెంకట్‌రెడ్డి నేపథ్యం**

విత్తనరహిత ద్రాక్షను సృష్టించిన ఆదర్శ రైతు. వ్యవసాయ రంగంలో చేసిన సేవలకు గత యేడాది కేంద్రం పద్మశ్రీతో సత్కరించింది. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో జాతీయ పేటెంట్ పొందిన మొట్టమొదటి వ్యక్తి వెంకటరెడ్డి కావడం విశేషం. నేల, వ్యవసాయంలో పోషక నిర్వహణ పద్ధతుల్లో ఆయనది అంతర్జాతీయ స్థాయి. పదులు సంఖ్యలో అంతర్జాతీయ, జాతీయ అవార్డులు పొందారు. అగ్రరాజ్యం అమెరికాకు ప్రెసిడెంట్లుగా సేవలందించిన బిల్‌క్లింటన్, డబ్ల్యూ జార్జ్ బుష్‌కు సేంద్రియ పద్ధతుల్లో పండించిన బ్లాక్ బ్యూటీ ద్రాక్షను రుచి చూపించిన వ్యక్తి. సికిందరాబాద్ అల్వాల్‌లో 12వ తరగతి వరకు చదివి వ్యవసాయంపై మక్కువతో చదువు ఆపివేశారు. తండ్రితోపాటు పొలానికి వెళ్లి వ్యవసాయంలో మెళకువలను నేర్చుకున్నారు. అల్వాల్, కీసర కుందనపల్లిలో 40 ఎకరాలు వ్యవసాయ క్షేత్రా న్ని సేంద్రియ వ్యవసాయ పరిశోధనలకు నిలయంగా మార్చారు. భూమి నీటిలోని సహజ పోషకాలు ద్వారా అత్యధిక దిగుబడిని రాబట్టగలిగారు. అల్వాల్‌లోని 5 ఎకరాలు వ్యవసాయ భూమిలో సేంద్రియ పద్ధతిలో బ్లాక్ బ్యూటీ సీడ్‌లెస్ ద్రాక్షను దేశంలోనే మొట్టమొదటిసారి పండించిన ఘనతను దక్కించుకున్నారు. సేంద్రియ పద్ధతిలో నేల నాణ్యతను పెంచడం ఆయ న ప్రత్యేకత. పోషకాలు క్షీణత కలిగిన మట్టిని చైతన్యం చేయడం ద్వారా వరి, గోధుములు పంటలు రెట్టింపు దిగుమతి సాధించారు. 2001, 2006 సంవత్సరాల్లో హైదరాబాద్ నగర పర్యటనకు వచ్చిన అప్పటి అమెరికా ప్రెసిడెంట్లు బిల్‌క్లింటన్, జార్జ్‌డబ్ల్యూ బుష్‌లకు తాను అనుసరిస్తున్న ఎస్‌ఎం విధానాన్ని స్వయంగా వారికి వివరించారు. ఆ సందర్భంగా ఇరువురు ప్రెసిడెంట్లకు 30 కేజీలు సీడ్‌లెస్ ద్రాక్షను బహూకరించారు. వెంకట్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో 20 ఆవులను పెంచుతున్నారు. మట్టి ఎరువులు, సాగు భూముల్లో నేల పోషక పదార్థాలు మెరుగుపరిచే ప్రక్రియ(నేల మార్పిడి), నేల సంతానోత్పత్తి మెరుగుపరిచే వినూత్న పద్ధతులకు పేటెంట్‌దారుడిగా ఉన్నారు. సేంద్రియ వ్యవసాయంలో వెంకట్‌రెడ్డి ఒక బ్రాండ్‌గా నిలవడంతో పద్మశ్రీ వరించింది.

# రాష్ట్రంలో ఆర్టీసికి బస్సులు కరువు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** తెలంగాణ రోడ్డు రవాణ సంస్థ (టిఎస్ ఆర్టీసీ)కి సొంత బస్సులకు దిక్కు లేకుండా పోయింది. సంస్థను కొత్త బస్సుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. సంస్థలో ఆధునిక సాంకేతిక పద్దతులను అమలు చేయడానికే ప్రాధాన్యతనిస్తున్న యాజమాన్యం కొత్త బస్సుల కొనుగోలుపై మాత్రం దృష్టిసారించకపోవడంతో ప్రగతి రథ చక్రాలకు కాలం చెల్లిన బస్సేలే గతవుతున్నాయి. దీంతో ప్రయాణీకులకు తగినన్ని బస్సులు నడప లేక ముక్కతూ మూలుగుతూ వీటితోనే సంస్థ యాజమాన్యం నడుపుకొస్తోంది. ఫలితంగా తరచూ నిలిచిపోవడం, పాడవడం, రిపేర్లకు రావడం వంటి వాటితో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ సాంకేతిక కారణాలతో పలు సర్వీసులు సమయానికి రాకపోవడం, మరికొన్ని అయితే దూరప్రాంతాలకు వెళ్లే సర్వీసులు సైతం రాత్రి సమయాల్లో తరచూ మొరాయిస్తున్నాయని సంస్థ కార్మికులే చెబుతున్నారు. సంస్థ అధికారవర్గాల వివరాల ప్రకారం ప్రస్తుతం ఆర్టీసీలో 9,092 బస్సులు ఉండగా, వీటిలో 6,047 మాత్రం సంస్థకు సొంతవి ఉన్నాయి. ఇందులో కూడా దాదాపు 3,025 బస్సులు కాలం చెల్లినవే కావడం విశేషం. రవాణా శాఖ మార్గదర్శకాల ప్రకారం 12 లక్షల కిలోమీటర్లు తిరిగిన లేదా 15 ఏళ్లు పూర్తి అయిన బస్సులను ఏది ముందు వస్తే దాని ప్రకారం అటువంటి వాటిని కాలం చెల్లిన వాటి కింద పరిగణిస్తారు. అయితే ప్రస్తుతం సంస్థలో 17 లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగిన బస్సులు కూడా రోడ్డెక్కుతున్నాయంటే సంస్థ పరిస్థితి ఏ విధంగా ఉందనేది అర్థమవుతోందని కార్మికులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటిలో 424 బస్సులు 15 ఏళ్లు పూర్తి అయినవి ఉండగా, 16 లక్షల కిలోమీటర్లు తిరిగినవి 338 బస్సులు, 17 లక్షల కిలోమీటర్లు తిరిగినవి 331 బస్సులు ఉన్నాయి. ఈ విధంగా కాలం చెల్లిన బస్సులతోనే ప్రయాణీకులకు మెరుగైన, నాణ్యమైన సేవలను అందిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్‌తో పోటీ పడ లేని యాజమాన్యం కనీసం

> **ప్రగతి చక్రాలకు కాలం చెల్లినవే గతి**
> **మొక్కుబడిగా కొత్త బస్సుల కొనుగోలు**
> **తరచూ మొరాయిస్తున్న సర్వీసులు**
> **ప్రయాణికుల సమస్యలపై దృష్టి సారించని సంస్థ**

ప్రయాణీకుల రద్దీకి తగినట్లుగా అదనంగా కొత్త బస్సులను తీసుకురాకపోగా, కాలం చెల్లిన బస్సులను తక్కుగా మార్చి వాటి స్థానంలో కొత్త వాటిని సైతం కొనుగోలు చేయడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్టీసీ ఏ మేరకు కొత్త బస్సులను కొనుగోలు చేసిందనే దానిపై గడచిన నాలుగేళ్లలో కేవలం 1,309 బస్సులను మాత్రమే సేకరించింది. 2014-15 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ యాజమాన్యం 117 బస్సులను కొనుగోలు చేస్తే తదుపరి ఏడాది 2015-16 ఆర్థిక సంవత్సరంతోపాటు, 2019-2022 మధ్య కాలం వరకూ పేరుకు ఒక్కటి కూడా సేకరించ లేదు. అలాగే 2016-17 ఆర్థిక సంవత్సరంలో 898 బస్సులు, 2017-18లో 294 బస్సులు మాత్రమే మొక్కుబడిగా కొనుగోలు చేసింది. గత ఏడాది సంస్థకు 1,016 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని యాజమాన్యం ప్రకటించినా ఇంత వరకూ 64 బస్సులను మాత్రమే సేకరించింది. ఈ విధంగా కొనుగోలు చేసిన మొత్తం బస్సుల్లో వజ్ర, గరుడ ప్లస్, స్లీపర్లు, రాజధాని వంటి ఎసి, సిటీ, విద్యుత్ బస్సులే అత్యధికంగా ఉన్నాయి. కాగా కొత్త బస్సుల కొరత కారణంగా ప్రధానంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ తన సేవలను అందించ లేకపోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ నుండి నగరాలు, పట్టణాలకు ప్రాధాన్యత నిస్తూ ఎక్కువ బస్సులను నడుపుతూ అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తునన ప్రయాణీకులకు రవాణా సౌకర్యాలు కల్పించడంలో ఘోరంగా విఫలమవుతోందనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త రూట్లలో తిప్పి ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉన్నా అందుకు తగినట్లుగా బస్సులు లేకపోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని సంస్థ అధికారులు అంటున్నారు.



జివి.ప్రభాకర్‌ను సత్కరిస్తున్న జస్టిస్ ఎన్.వి.శ్రావణ్‌కుమార్, వంశీ రామరాజు, ఉదయ్‌శంకర్, ఓలేటి పార్వతీశం తదితరులు

## ప్రపంచమంతా అర్థం చేసుకునేది ఒక్క సంగీతం మాత్రమే

### హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రావణ్‌కుమార్

### స్వరఘనాపాటి గరికిపాటి వెంకటప్రభాకర్‌చే 'స్వర రాగావధానం'

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** ప్రపంచమంతా అర్థం చేసుకునేది ఒక సంగీతం మాత్రమేనని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.శ్రావణ్‌కుమార్ అన్నారు. తమ కుటుంబమంతా సంగీతంతో కూడుకుందన్నారు. ప్రపంచంలో రెండు గొప్ప సాధనాలు, సంగీతం, సాహిత్యం అని అన్నారు. గరికిపాటి వెంకటప్రభాకర్‌చే స్వర రాగావధానం' ఎంతో గొప్పగా నూతనంగా అవధాన ప్రయోగం చేయడం అభినందనీయమన్నారు. వంశీ ఇంటర్నేషనల్, ఎస్ఎస్.మ్యూజిక్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో శుభోదయం గ్రూప్ సమర్పణలో గానవిద్యాప్రవీణ, స్వరశుభాకర, స్వరఘనపాటి గరికిపాటి వెంకటప్రభాకర్‌చే 'స్వర రాగావధానం' కార్యక్రమం గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ ఎన్.వి.శ్రావణ్‌కుమార్ హాజరవగా కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, ఆలిండియా రేడియో డైరెక్టర్ వి.ఉదయశంకర్, వంశీ ఇంటర్నేషనల్ అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ డాక్టర్ వంశీ రామరాజు, ఎల్ఐసి రీజనల్ మేనేజర్ శైలజ, ఎస్ఎస్.మ్యూజిక్ అకాడమి నిర్వాహకురాలు జి.పి.లలితాప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. జస్టిస్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అవధాన ప్రయగాలు చాలా అర్థం చేసుకుని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అవధానం గురించి మాట్లాడాలంటే, రోజులు సరిపోవని అన్నారు. సంగీతానికి లిమిట్‌గాని, సరిహద్దులు లేవని, సంగీతం ఎక్కడున్నా రాబోయే తరాలకు ప్రోత్సహించాలని అన్నారు.





## త్వరలో రోడ్లపైకి ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్సులు

### కార్బన్‌రహిత ప్రత్యామ్నాయ ప్రజారవాణాలో ఇదో మైలురాయి

### ఒక్కసారి హైడ్రోజన్ నింపితే 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించే డిజైన్

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనుబంధం సంస్త ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ మరో మైలురాయి సొంతం చేసుకుంది. పర్యావరణహిత భవిష్యత్తు ప్రజా రవాణా వ్యవస్తను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సిద్ధమైంది. రిలయన్స్ సంస్థ సాంకేతిక భాగస్వామ్యంతో ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్సును రూపొందించింది. కార్బన్ రహిత ప్రజా రవాణా వల్ల వాతావరణ కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. డిజీల్, పెట్రోల్, సిఎన్‌జితో నడిచే బస్సులు వల్ల కాలుష్యం పెరుగుతోంది. దీనికి పూర్తి భిన్నంగా ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్సును రూపొందించింది. ఈ బస్సులో ఒకేసారి 400 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి వీలుపడుతుంది. పెట్రోల్, డీజిల్ నిల్వలు ప్రపంచ వ్యాప్తంగా తగ్గిపోతుండటం, వాటి ధరలు ఆకాశాన్ని తాకుతుండటం, వారి ఉద్గారాలను పర్యవరణంపై తీవ్ర ప్రభావం పడటం వంటి భవిష్యత్తు సవాళ్లకు అన్నింటికి హైడ్రోజన్ బస్సు పెద్ద సమాదానంగా కనబడుతోంది. కార్బన్ రహిత హైడ్రోజన్ రవాణా ఆశయాలను సాధించాలన్న భారత ప్రభుత్వ లక్ష్య సాధనకు ఈ సరికొత్త హైడ్రోజన్ బస్సుల తయారీ ఎంతగానో దోహదం చేస్తుంది. హైడ్రోజన్ బస్సులు ద్వారా మనదేశం స్థిరమైన ఇంధన భద్రతను సంతరించుకుంటుంది. ఈ హైడ్రోజన్ బస్సు 12 మీటర్ల పొడువు ఉంటుంది. ఈ బస్సులో డ్రైవర్ సీటు కాకుండా ప్రయాణీకుల కోసం 32 నుంచి 49 సీట్లు ఏర్పాటు చేశారు. ఒక్కసారి హైడ్రోజన్ నింపితే 400 కిలోమీటర్ల వరకు బస్సు ప్రయాణిస్తుంది. బస్సులో హైడ్రోజన్ నింపడానికి కేవలం 15 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. సాంప్రదాయ ఇంధనాలతో నడిస్తే బస్సుల్లో ఉద్గారాలు పొగగొట్టం ద్వారా కాలుష్యాన్ని వెదజల్లుతాయి. కానీ ఈ హైడ్రోజన్ బస్సులో బెయిల్‌పైప్ ద్వారా కేవలం నీరు మాత్రమే బయటకు వస్తుంది. ఇది పర్యావరణానికి ఏ మాత్రం హాని చేయదు. ప్రస్తుతం ప్రజా రవాణాలో అత్యధికంగా వినియోగిస్తున్నా డీజిల్, పెట్రోల్ వాహనాలను దశల వారీగా తొలగించి, వాటి స్థానంలో ఈ గ్రీన్ బస్సులను తీసుకురావడానికి ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ తయారీ చేసిన హైడ్రోజన్ బస్సు పర్యావరణహిత ప్రజా రవాణా చరిత్రలో ఒక మైలురాయిగా చెప్పవచ్చు.

ఈ బస్సు సిస్టమ్ విషయానికి వస్తే, బస్సు పై భాగంలో టైప్--4 హైడ్రోజన్ సిలిండర్ల ఏర్పాటు చేస్తారు. ఈ సిలిండర్లు మైనర్ 20 నుంచి ప్లస్ 85 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలను తట్టుకునేలాగా డిజైన్ చేశారు. ఈ బస్సులను యేడాదిలోగానే వాణిజ్యపరంగా ఉత్పత్తి ప్రారంభించాలని ఒలెక్ట్రా లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి పేరు సంస్థ సాంకేతిక సహకారం అందించడం శుపరిణామంగా చెప్పవచ్చు. రానున్న కాలంలో భారతదేశ వ్యాప్తంగా ఒలెక్ట్రా హైడ్రోజన్ బస్సులను ప్రజలకు సుఖవంతమైన పర్యావరణహితమైన రవాణా అనుభూతిని మిగిల్చేందుకు సిద్ధపడుతున్నాయి.

## కేసును పక్కదోవ పట్టిస్తున్నారు..

### వరంగల్ పిజి వైద్య విద్యార్థిని తండ్రి ఆవేదన

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త :** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఆత్మహత్యకు యత్నించిన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి తండ్రి నరేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రతీ కేసును తారుమారు చేస్తున్నారని ఆరోపించారు.డిఎంఇ వ్యాఖ్యలపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాగింగ్ జరగలేదని డిఎంఇ చెప్పడం తప్పని ఆయన అన్నారు. తనను ర్యాగింగ్ చేస్తున్నారని ప్రీతి ఏడుస్తూ తమకు చెప్పడంతోనే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రతీ మొబైల్ చెక్ చేస్తే అన్ని విషయాలు బయటికి వస్తాయని అన్నారు. కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రీతి మొబైల్‌లో డేటా అంతా డిలీట్ చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు ప్రీతి సెల్‌ఫోన్‌ను సీజ్ చేశామని పోలీసులు చెబుతున్నారని నరేందర్ ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న తన కుమార్తెకు సరైన వైద్యం అందడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంచి ట్రీట్‌మెంట్ అందించి తన కుమార్తెను కాపాడాలని కోరారు. ఈ మేరకు ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు.ప్రీతీని అడ్మిట్ చేసి 24 గంటలు గడుస్తున్నా ఆమె ఆరోగ్య పరిస్థితిపై హెల్త్ బులిటెన్ ఇవ్వలేదని నిమ్స్ వైద్యులపై నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వరంగల్ ఎంజీఎంలోనే సరైన వైద్యం అందినట్లు కనిపిస్తోంది. ఇక్కడ ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదు. నా కుమార్తె ఆరోగ్యంపై ఎలాంటి అప్‌డేట్ లేదు. ఎంజీఎంలో గొడవ అవుతుందని..ఆస్పత్రి పరువుపోతుందని ఇక్కడికి తరలించారు. నా కుమార్తెకు జరుగుతున్న వేధింపులపై స్థానిక పోలీసు అధికారులకు ఫోన్ చేసి చెప్పినా వారు సరిగా స్పందించలేదు. ఆర్పీఎఫ్‌లో పనిచేసే నేను..ఆత్మహత్యలు చేసుకునేందుకు యత్నించిన ఎంతో మందికి కౌన్సెలింగ్ ఇచ్చాను. చివరికి నా కుమార్తెకు ఈ గతి పట్టింది. దీనికి కారణమైన హెచ్‌వోడీ, సీనియర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. మంచి ట్రీట్‌మెంట్ ఇచ్చి నా కుమార్తెను బతికించాలి. ఆమెకు జాబ్ లేకపోయినా పర్వాలేదు. బతికితే చాలు. బిచ్చమెత్తుకుని అయినా పోషించుకుంటా. ఈ విషయంలో ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి" అని నరేందర్ కోరారు.

**ర్యాగింగ్ కాదు..వేధింపు ఆరోపణలపై విచారణ:**

**డిఎంఇ రమేష్‌రెడ్డి**

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ఎటువంటి ర్యాగింగ్ జరగలేదని తెలంగాణ వైద్య విద్యై డైరెక్టర్ (డిఎంఇ) రమేష్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నిమ్స్‌కు వెళ్లిన ఆయన..వరంగల్‌లో ఆత్మహత్యకు యత్నించిన పీజీ వైద్య విద్యార్థిని ప్రీతికి కొనసాగుతున్న చికిత్సపై ఆరా తీశారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థిని ప్రీతి ఆరోగ్యం విషమంగానే ఉందని..వెంటిలేటర్‌పై ఆమెకు చికిత్స కొనసాగుతోందని రమేష్‌రెడ్డి తెలిపారు. కేఎంసిలో ర్యాగింగ్ జరగలేదన్నారు. విద్యార్థిని, సీనియర్ మధ్య ఉన్నవి మనస్పర్థలు మాత్రమేనని చెప్పారు. దీనిపై ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు.

ఈ ఘటనపై కమిటీని నియమించామని..ఆ కమిటీ నివేదిక వచ్చాక చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థిని కాపాడేందుకు నిమ్స్ వైద్యులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాగా మరోవైపు పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై కమిటీ ఏర్పాటైంది. నలుగురు ప్రొఫెసర్లతో కూడిన కమిటీనీ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ నియమించారు. కమిటీ నివేదకను డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) రమేష్‌రెడ్డికి సమర్పించనున్నారు.

**ప్రీతికి కార్డియాక్, శ్వాసకోశ సమస్యలు: నిమ్స్ వైద్యులు**

నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్యంపై వైద్యులు హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. ప్రీతి నిమ్స్‌లో జాయిన్ అయ్యేటప్పటికీ మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ ఉందని వైద్యులు చెప్పారు. ప్రీతిని వెంటిలేటరీ అయానోట్రోపిక్ సపోర్టుతోనే నిమ్స్‌కు తరలించారని అన్నారు. ప్రస్తుతం కార్డియాక్, శ్వాస కోశ సమస్యలు ఉన్నాయని చెప్పారు. స్పెషలిస్టు వైద్యుల సహాయంతో చికిత్స అందిస్తున్నామని నిమ్స్ డాక్టర్లు తెలిపారు. మరోవైపు ప్రీతిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సతీమణి ఉష పరామర్శించారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సైఫ్‌ను వరంగల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**నిమ్స్ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత**

నిమ్స్ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. నిమ్స్ ఆసుపత్రి దగ్గర బిజెపి మోర్చా ఆందోళనకు దిగారు. వైద్య విద్యార్థిని ప్రీతి చికిత్స వివరాలు ఎందుకు తెలపడం లేదని నిరసనకు దిగారు.ప్రీతి హెల్త్ బులెటిన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతం కావడంతో బిజెపి మోర్చా నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, బిజెపి మోర్చా నేతల మధ్య పరస్పరం తీపులాట జరిగింది. దీంతో నిమ్స్ ఆసుపత్రి దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరూ లోనికి వెళ్లకుండా

## ప్రతి జోన్‌కు ఒక జాయింట్ కమిషనర్

### గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** వీధి కుక్కల ప్రమాదల నుంచి ప్రజలను సంరక్షించేందుకు జిహెచ్‌ఎంసి యుద్ధ ప్రాతిపదికన ప్రతి జోన్‌కు ఒక జాయింట్ కమిషనర్‌ను నియమిస్తూ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాలు జారీచేశారు. వీధి కుక్కల ప్రమాదాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ క్షేత్రస్థాయిలో జాయింట్ కమిషనర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి చర్యలు తీసుకునేందుకు నియమించామని నగర మేయర్ తెలిపారు. కుకట్‌పల్లి జోన్ జాయింట్ కమిషనర్ శానిటేటర్ సంధ్య, సికింద్రాబాద్ జాయింట్ కమిషనర్ ఎస్‌బిఎం, హెల్త్ ఉమా ప్రకాష్, ఎల్‌బినగర్ జాయింట్ కమిషనర్ జేసు వార్త, శేరిలింగంపల్లి జాయింట్ కమిషనర్‌గా ఎల్‌పి మల్లయ్య, చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్‌గా శైలజ, ఖైరతాబాద్ జాయింట్ కమిషనర్ శ్రీనివాసులు నియమించారు. హోటల్, రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్, నాన్ వెజిటేరియన్, షాప్స్, హాస్పిటల్, హాస్టల్స్, ఇతర వాణిజ్య సముదాయ నాన్ వెజిటేరియన్ షాప్స్, ఫంక్షన్‌హాల్స్,హాస్టల్ ద్వారా నాన్‌వెజిటేరియన్‌ను వీధిలో, పబ్లిక్ ప్లేస్‌లలో పారవేయకుండా, నిర్దేశిత ప్రదేశాలలో మాత్రమే వ్యర్థాలను డంప్ చేసేందుకు ఆమోదం. దీని ద్వారా కుక్కల గుంపులను తిరగడం నియంత్రించవచ్చునన్నారు. కుక్కలను దత్తత తీసుకునేందుకు పెట్ ఓనర్ షిప్‌ను అమలు చేస్తున్నామని మేయర్ తెలిపారు.

అదేవిధంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించేందుకు ముందస్తు రక్షణ చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించేందుకు మెమో నెంబర్.3308 ద్వారా పలు సూచనలకు ఉన్నత స్థాయి సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా పలు రకాల సూచనలు ఆమోదించారు.



## తెలంగాణలో రూ.800 కోట్లతో అమెరికన్ సంస్థ పెట్టుబడులు

### కెటిఆర్ సమక్షంలో బ్రిస్టల్ మేయర్స్‌తో ప్రభుత్వం ఎంఒయు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి 23:** అమెరికాకు చెందిన ఫార్మా సంస్థ బ్రిస్టల్ మేయర్స్‌తో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో బ్రిస్టల్ మేయర్స్ సంస్థ ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. రూ.800 కోట్లకు పైగా పెట్టుబడితో ముందుకొచ్చిన ఈ సంస్థ ద్వారా 1500 మంది ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద ఫార్మా క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా బ్రిస్టల్ మేయర్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. బ్రిస్టల్ మేయర్స్ సంస్థ ప్రపంచంలోనే టాప్ టెన్ ఫార్మా కంపెనీల్లో ఒకటని, తెలంగాణలో లైఫ్ సైన్సెస్ రంగం బలంగా,వేగంగా ఎదుగుతోందన్నారు. ఈ రంగంలో ఉన్న యువతకు ఇదొక మంచి అవకాశమని, ఇప్పటి వరకు భారత్‌లో లేని సంస్థ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడైనా ఒక సంస్థ యూనిట్‌ను పెట్టాలంటే 12 నుంచి 18 నెలల వ్యవధి పడుతుందని, హైదరాబాద్ ఫార్మా సిటీలో అలా కాకుండా అన్ని అనుమతులు ఉన్నందున ఎలాంటి జాప్యం లేకుండా ఇక్కడ వెంటనే సంస్థ కార్యకలాపాలు మొదలు పెట్టవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్నటువంటి ఇతర అనుకూలతలను కూడా సంస్థ పరిగణలోకి తీసుకోవాలని సంస్థ ప్రతినిధులకు సూచించామన్నారు. తయారీ రంగంలోనూ బ్రిస్టల్ మేయర్స్ దృష్టి సారించాలని సూచించారు. బ్రిస్టల్ మేయర్స్ ప్రతినిధి సమిత్ హిరావత్ మాట్లాడుతూ ఫార్మా రంగంలో సరికొత్త ఔషధాల పరిశోధన,అభివృద్ధి,ఉత్పత్తి మా లక్ష్యమని తెలిపారు. నాలుగేళ్ల క్రితం తాను చేసిన హైదరాబాద్ కంటే ఇప్పుడు అద్భుతమైన అభివృద్ధి కనిపిస్తోందన్నారు. మేం భారత్‌లో క్లీనికల్ ట్రయల్స్ నిర్వహిస్తామని, ఈ రంగంలో మెరుగైన అవకాశాల కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో 100 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడతామని వెల్లడించారు.

## బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బిజెపి మాత్రమే

### బూత్ స్వశక్తీకరణ అభియాన్ వర్క్‌షాప్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, ఫిబ్రవరి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బిజెపియేనని ప్రజలు భావిస్తున్నామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఉప ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శమమన్నారు. ఎన్నికలెప్పుడొచ్చినా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందులో భాగంగానే పూర్తిస్థాయిలో పార్టీలో సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుమన్నారు. సంస్థాగత నిర్మాణం విషయంలో కాంగ్రెస్, టిఆర్ఎస్‌లతో పోలిస్తే బిజెపి బలంగా ఉందన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బూత్ స్వశక్తికరణ్ అభియాన్ వర్క్‌షాప్ ప్రారంభమైందన్నారు. బండి సంజయ్‌తో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సాల్, జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్, తమిళనాడు సహా ఇంచార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎన్.ఇంద్రసేనారెడ్డి, విజయశాంతి, జితేందర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ప్రమేందర్‌రెడ్డి, దుర్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శృతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్, టిఆర్ఎస్, తెలుగుదేశం పార్టీలకు సంస్థాగతంగా బూత్ కమిటీల్లేవు అన్నారు. గ్రామ, మండల కమిటీలు లేవని, సంస్థాగతంలో బలంగా లేని పార్టీలు సుదీర్ఘకాలంగా మనుగడ సాధించలేవన్నారు. బిజెపి సంస్థాగతంగా బలంగా ఉన్నందునే 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నామన్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లో సంస్థాగత నిర్మాణం బలంగా ఉన్నందున ఓటు బ్యాంకు పెంచుకుంటూ అధికారంలోకి ఉన్నామన్నారు.



## విమానం నుంచి దించి పవన్ ఖేరా అరెస్టు

### ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఉద్రిక్తత



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23:** దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ ప్లీనరీ సెషన్‌కు హాజరయ్యేందుకు బయల్దేరిన ఆ పార్టీ సీనియర్ నేత పవన్ ఖేరాను ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అస్సాం పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను విమానం నుంచి దించేశారు. హైడ్రామా అనంతరం ఆయనను అస్సాం పోలీసులు అరెస్టు చేసినట్లు కాంగ్రెస్ తెలిపింది. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పుర్‌లో శుక్రవారం నుంచి ఎఐసిసి ప్లీనరీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు హాజరయ్యేందుకు పవన్ ఖేడా సహా పలువురు కాంగ్రెస్ నేతలు గురువారం ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో వీరంతా ఇండిగో విమానం ఎక్కారు. అయితే టేకాఫ్‌కు కొద్ది నిమిషాల ముందు లగేజీ విషయంలో ఏదో సమస్య ఉందని విమానం దిగాలని సిబ్బంది పవన్ ఖేడాను కోరారు. మిమ్మల్ని పోలీసులు కలుస్తారని విమాన సిబ్బంది చెప్పారు. ఈ విషయం తెలియగానే కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా దిగి విమానం పక్కనే ఆందోళన చేపట్టారు. ఈ పరిణామాలతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. నేను ఒకే ఒక్క బ్యాగేజీ తెచ్చుకున్నా. అయినా నన్ను విమానంలోకి అనుమతించలేమని చెప్పారు. పోలీసులు వచ్చి కలుస్తారని అన్నారు అని విమానం దిగిన తర్వాత పవన్ ఖేడా తెలిపారు. గందరగోళ పరిస్థితుల అనంతరం పవన్ ఖేడాను అస్సాం పోలీసులు అరెస్టు చేసినట్లు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. అనంతరం ఆయనను గువాహటికి తరలిస్తున్నట్లు సమాచారం. ప్రధానమంత్రి నరేంద్రమోడీపై అవమానకర వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అస్సాం పవన్ ఖేడాపై బిజెపి నేత ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న అస్సాం పోలీసులు గురువారం ఆయనను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. దీన్ని కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. ఎలాంటి అరెస్టు వారెంట్ లేకుండానే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని ఆ పార్టీ నేతలు మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం గూండా తరహాలో వ్యవహరిస్తోంది. ఎఐసిసి ప్లీనరీకి వెళ్లకుండా పవర్‌ఖేడాను అడ్డుకున్నారు.

ఆయన గొంతును అణగదొక్కేందుకు సినీ ఫక్కీలో ఎఫ్ఐఆర్ డ్రామా ఆడారు. ఇది సిగ్గుచేటు అని పార్టీ సీనియర్ నేత కెసి వేణుగోపాల్ ట్విట్టర్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. అతర్వాత బెయిల్‌కోసం చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరుచేసింది. పవన్‌ఖేరా వాస్తవానికిఛత్తీస్‌ఘర్‌లోజరిగే ప్లీనరీ సమావేశాలకు హాజరు అయ్యేందుకు వచ్చిన తరుణంలోనే ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అరెస్టుచేసారు. చీఫ్‌జస్టిస్ డివై చంద్రచూడ్ ఈసందర్భంగా అస్సాం, ఉత్తరప్రదేశ్‌ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసారు. అక్కడ రిజిష్టరుచేసిన ఎఫ్ఐఆర్‌లు అన్నింటినీ మిక్స్‌చేసి విచారణకు నివేదించాలని ఆదేశాలు జారీచేసారు. సుప్రీంకోర్టు విచారణ తర్వాత వెనువెంటనే విడుదలచేయాలని మేజిస్ట్రేట్‌కు ఉత్తర్వులు జారీచేయడంతోకాంగ్రెస్ అధికారప్రతినిదికి పెద్దఊరట లభించినట్లయింది. ఎసిపి కిషన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రీతి తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తాను ఏసీపికి వాట్సాప్ ద్వారా పంపించిన ఫిర్యాదును మీడియాకు విడుదల చేశారు. కాగా ప్రీతి తండ్రి ఫిర్యాదుకు ఏసీపి తక్షణమే స్పందించి ఉంటే ఆమెకు ఈ పరిస్థితి వచ్చేది కాదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

## అమృత్‌సర్‌లో ఉద్రిక్తత..

### పోలీస్‌స్టేషన్ ముట్టడికి యత్నించిన 'వారిస్ పంజాబ్ దే' కార్యకర్తలు

### పలువురి చేతుల్లో తుపాకులు, తల్వార్లు

### పోలీసులతో ఘర్షణకు దిగిన నిరసనకారులు

**అమృత్‌సర్, ఫిబ్రవరి 23:** పంజాబ్‌లోని చారిత్రక నగరం అమృత్‌సర్ గురువారం ఉద్రిక్తంగా మారింది. ఓ మత బోధకుడి అనుచరిడిని అరెస్ట్ చేసినందుకు..అతని మద్దతుదారులు వందలాదిగా పోలీస్ స్టేషన్‌పైకే దండయాత్రగా బయలుదేరారు. వారి చేతుల్లో తుపాకులు, తల్వార్లు ఉండటంతో ఎప్పుడు ఏంజరుగుతుందోనన్న ఉత్కంఠతో నగర ప్రజలు ఊపిరి బికపట్టుకొని గమనించారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి..

'వారిస్ పంజాబ్ దే' గ్రూప్‌నకు అమృత్‌పాల్ సింగ్ అధినేత. ఆయన ముఖ్య అనుచరుడు లవ్‌ప్రీత్‌తుఫాన్‌ను ఇటీవల ఓ కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. లవ్‌ప్రీత్ అరెస్ట్‌ను నిరసిస్తూ అమృత్‌పాల్ నేతృత్వంలో అమృత్‌సర్‌లో గురువారం వందలాదిమందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. వారిలో పలువురి చేతుల్లో తుపాకులు, తల్వార్లు ఉండటం గమనార్హం. నిరసనకారులు నగరంలోని అజ్‌నాలా పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లేందుకు యత్నించారు. వందలాదిమంది అక్కడి ఫెన్సింగ్‌ను దాటుకొని అడ్డంగా పెట్టిన బారికేడ్లను తొలగించుకొని వెళ్లడంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. లవ్‌ప్రీత్‌పై కేసును గంట వ్యవధిలో ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని అమృత్‌పాల్ హెచ్చరించారు. తమను తక్కువ అంచనా వేస్తున్నారంటూ ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఆ గ్రూప్ నేతలతో చర్చించారు. వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**లవ్‌ప్రీత్ విడుదలకు అధికారుల హామీ**

లవ్‌ప్రీత్ శుక్రవారం విడుదల అవుతాడని అమృత్‌సర్ ఎస్ఎస్‌పి సతీందర్‌సింగ్ తెలిపారు. ఈ నెల 15న జరిగిన ఓ హింసాత్మక ఘటనకు సం బం ధించి అతడిని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. ఆ సంఘటనలో లవ్‌ప్రీత్ ప్రమేయం ఏమీలేదని అతడి అనుచరులు సాక్ష్యం చూపుతున్నారని, దాంతో అతడిని కోర్టులోప్రవేశపెట్టి విడుదలచేస్తామని ఎస్ఎస్‌పి పేర్కొన్నారు.

